క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెదఅలవల పాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనకు సమీప బ్యాంకు లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పథకం లో చేరితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు.

95 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండలంలోని వేముల పాడు గ్రామంలో సోమవారం ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు కార్యక్రమం నిర్వ హించారు. డాక్టర్ సందీప్ ఇంటింటికీ తిరిగి 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం తో బాధపడుతున్న వారి, జలుబు దగ్గు, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మం దులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాపురెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన

గుడ్లూరు: మండలంలోని కొత్తపేట, గుడ్లూరు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా లను ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సోమవారం పరి శీలించారు. పొడి, తడి చెత్తలను వేసి ఉన్న తొట్టెలను ఆయన పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి పంచాయతీ పారిశుద్ధ్య కారి ్మకులు సేకరించిన పొడి, తడి చెత్తలను చెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ఉన్న తొట్టెల్లో వాటిని వేసి ఎరువులను తయారు చేస్తామన్నారు. ఎరువులను అమ్మడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. ఈ కేంద్రాలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అల సత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం కృష్ణారావు హెచ్చరించారు. స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పెండిం గ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ పంపిణీ

మర్రిపూడి: మండలంలోని ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నుం చి రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ ఈవీ రంగయ్య తెలిపారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం కలిపిన 150 గ్రాముల జావ అందజేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో వివరించారు.

విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ

టంగుటూరు: మండలంలోని కందులూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ గ్లాసు లను ఎంపీటీసీ ఆరితోటి దొరబాబు సోమవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాట్లా డుతూ.. ప్రభుత్వం రాగిజావ పంపిణీ చేస్తుండ టంతో, విద్యార్థులకు అవసరమైన గ్లాసులు సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఎం సరస్వతి, ఉపాధ్యాయులు రామారావు, దార్ల బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుం టున్నామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డుల్లో సోమవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. వార్డులోని ప్రజలు మురికినీటి కాలువ సమ స్యలను విన్నవించారు. దీంతో స్పందించిన చైర్మన్ గఫార్..రోడ్లపై మురుగునీరు పారకుం డా నూతన డ్రైనేజీ కాలువలను త్వరలో నిర్మిస్తా మన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ నాయబ్ రసూల్, నాగూర్వ లి, నాగూర్బీ, భారతీ, మన్సూర్, శానిటరీ కార్యదర్శి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం బాట అనుసరణీయం

పొమూరు: మల్లు స్వరాజ్యం బాట అనుసరణీ యమని ఐద్వా సీనియర్ నాయకురాలు షేక్. మాదార్బీ అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి స్థానిక సుందరయ్య భవన్లో సోమవారం ఐద్వా మండల అధ్యక్షురాలు భానుమతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సం దర్భంగా మల్లుస్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా మండల కార్యదర్శి ఖాదరున్నీసా, షేక్.మస్తా నమ్మ, షేక్.మస్తానమ్మ, అంజలి, వరమ్మ, ప్రభావతి, కొండమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

నీటికష్టాలకు చెక్‌డ్యాంలు



మరమ్మతుల అనంతరం దూబగుంట్లవద్ద నీటి కుంట



పడమటిపల్లె వాగువద్ద నిర్మించిన చెక్‌డ్యాం

- మండలంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెక్‌డ్యాంల నిర్మాణం
- నీటి కుంటలకు మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పొమూరు: వర్షం నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి బొట్టును వడిసిపట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుంది. మరోపక్క ప్రభుత్వం చొరవతో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండ లంలో నీటి కుంటలకు మరమ్మతులు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టారు. మండలంలోని దూబగుం ట్లలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాటర్‌షెడ్‌లో భాగంగా నిర్మించిన నీటి కుంట నాణ్యతా ప్రమా ణాలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే గండిపడి నీరు వృథాగా పోయింది. అదేవిధంగా వెంకటాపు రంలో చెక్‌డ్యామ్ పూర్తిగా దెబ్బతింది. విషయాన్ని వైఎస్సార్‌సీపీ రైతువిభాగం మండల అధ్యక్షుడు కం దుల శ్రీను రిలయన్స్ ఫౌండేషన్ దృష్టికి తీసుకు పోయారు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ వారు రు. 2 లక్షలు వెచ్చించి దూబగుంట్ల నీటి కుంటకు మరమ్మతులు చేయించారు. అదేవిధంగా వెంకటాపు రంలో చెక్‌డ్యాంకు రు.1.10 లక్షలు వెచ్చింది పూర్తిస్థా యిలో మరమ్మత్తులు చేయించారు. అదేవిధంగా పడ మటిపల్లె వాగువద్ద రూ.1.30 లక్షలతో నూతనంగా చెక్‌డ్యామ్ నిర్మించారు. అనంతరం రైతుసంఘాలు ఏర్పడి ఉన్న వెనుకబడిన గ్రామాల్లో బుక్కాపురం గ్రామ పంచాయతీలో పోలేరమ్మ కుంటకు రు.1.75 లక్షలతో మరమ్మతులు నిర్వహించడంతో పాటు చెక్‌డ్యామ్ నిర్మించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో వేసవిలో పడే జల్లులకు, వర్షాకాంలో పడే వర్షాలకు నీరుచేరి భూగర్భ జలాలు పెరగడంతోపాటు పశుపో షకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలపెంపు సాధ్యం



చెడ్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలపెంపు సాధ్యమవుతుంది. ప్రభుత్వం చొరవతో రిల యన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతుసంఘాలు ఉండి వెను కబడిన గ్రామాల్లో రిలయన్స్‌సంస్థ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. చెక్‌డ్యాంల నిర్మాణానికి పంచాయతీల నుంచి స్థలం కేటాయింపుతో పాటు తీర్మానం చేసి ఇచ్చాం. రియలన్స్ సంస్థ ఆధ్వ ర్యంలో పనులు పూర్తి చేశారు. – శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ దూబగుంట్ల

మరమ్మతులతో నీటి నిల్వకు అవకాశం



గత టీడీపీ ప్రభుత్వ హాయాంలో నిర్మించిన చెక్‌డ్యాం కొద్దిపాటి వర్షానికే గండిపడి నీరు వృ థాగా పోయింది. ప్రభుత్వ చొరవతో రిలయన్స్‌వారు నీటి కుంటకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశారు. చెక్‌డ్యాం లతో భూగర్భజలాలు పెంపుతో పాటు నీరు నిల్వ ఉండి పశుపోషకులకు ఎం తో ఉపయోగకరంగా ఉంటుంది. – శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతుసంఘం మండల అధ్యక్షుడు

ఉపాధి పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు రూరల్: మండలంలోని 19 పంచాయ తీల్లో 2021–22 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వ హించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిం చిన బృందం సోమవారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యా లయం వద్ద ప్రజా వేదిక నిర్వహించారు. 19 పంచా యతీల్లో 493 పనులకు గాను రూ.12.62 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రెసిడెంగ్ ఆఫీసర్, కలిగిరి ఏపీడీ సీహెచ్.శ్రీహరిరెడ్డి తెలిపారు. సామాజిక తనిఖీ డీఆ ర్పీలు గ్రామాల్లో చేసిన తనిఖీల వివరాలను వెల్లడిం చారు. ఇళ్ల స్థలాల డెవలప్ చేసిన పనులపై కూడా సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పలుకూరు, నరిశెట్టివారిపాలెం, కోవూరు గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు కొన్ని చనిపోయినట్లు తెలిపారు. మస్టర్ల నిర్వహణలో లోపాలు ఉండడంతో రికవరీలు పడ్డాయి. పనుల ప్రదేశంలో వివరాల బోర్డులను నిర్మించకపోవడంపై రికవరీలు రాశారు. ఇలా మొత్తం 19 పంచాయతీల్లో రూ. 1,32,487 నగ దును రికవరీ రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్‌బాబు, ఏపీడీ సంజీవరావు, జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎస్ఆర్పీ ఇ.కాంతయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.06 లక్షలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,06,228 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ 46,190, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,110, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.13,464, భక్తులకు ఉచితం గా ప్రసాదం అందజేసేందుకు దాతలు ఇచ్చిన విరాళం రూ 8,464, ఇతర విరాళాలు రూ 16,000 వచ్చినట్లు చెప్పారు.

వెండి గంట బహూకరణ..

నారాయణస్వామి ఆలయానికి దాతలు వెండి గం టను బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణా ధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. పొమూ రుకు చెందిన దాతలు గోష్ఠు వెంకటేశ్వరరావు, ప్రతిమ దంపతులు స్వామికి సుమారు రూ.4,700 విలువైన వెండి గంటను బహూకరించారు.

ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా..?

- ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ ఆగ్రహం



ఉలవపాడులో జరుగుతున్న ప్రజావేదిక

ఉలవపాడు: ఇంజినీరింగ్ అసిస్టెంట్లలో ఇంత నిర్లక్ష్యం పనికిరాదని డ్వామా క్వాలిటీ కంట్రోల్ ఈఈ, డ్వామా అడిషనల్ పీడీ నిర్మలాదేవి అన్నారు. ఉలవపాడులో సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో వారు మాట్లాడారు. పంచాయ తీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌ల పనుల వివరాలకు సం బంధించిన తీర్మానాలు, ఎంబుక్‌ల వవిరాలను కనీసం తనిఖీ బృందాలకు ఇవ్వకపోవం ఏంటని ప్రశ్నించారు. కొత్తగా ఉద్యోగాలలో చేరిన మీరు తనిఖీ బృందాలకు సహకరించకుండా వ్యవహరిస్తే ఎలా అన్నారు. ప్రజావేదిక జరుగుతుందని తెలిసి కూడా కనీసం ఇప్పటివరకు సచివాలయ భవనని ర్మాణాల వివరాలు ఎందుకు అందచేయలేదని ప్రశ్నించారు. రూమ్‌లో కూర్చోబెట్టి అప్పటికప్పుడు వివరాలు రాయించి తీసుకున్నారు. ప్రజావేదిక జరుగుతున్న సమయంలో కనీసం ఉద్యాన శాఖ అధికారులుకానీ, సర్వశిక్షా అభియాన్ అధికారులు కానీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కానీ హాజ రుకాలేదు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి పనుల గురించి వివరిం చారు. ప్రధానంగా పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని గుర్తించారు. జగనన్న లేఅవుట్ లలో నాటిన మొక్కలు పూర్తిస్థాయిలో బతకలేదని తక్కువ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. కరేడులో పి.యానాది, రమణమ్మ, సునీత, లక్కయ్యలకు పనిచేసిన దినాల కన్నా ఒక రోజు ఎక్కువ వేతనం ఇచ్చినట్లు గుర్తించారు. వాకలో ఉద్యాన శాఖ ద్వారా ఇచ్చిన మొక్కల్లో ఒక్క మొక్క కూడా లేదని గుర్తిం చారు. బాలకోటయ్య సంఘంలో 200 మొక్కలకు గాను 12 మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. బద్ది పూడిలో లేఅవుట్ రోడ్డులో 30 అడుగులు తక్కువ వేసినట్లు తెలిపారు. రామాయపట్నంలో కూలీల సంతకాలు లేకుండా వేతనాలు ఇచ్చినట్లు తెలి పారు. ఉలవపాడులో పనుల వద్ద బోర్డులు ఏర్పా టుచేయలేదని తెలిపారు. 720 మొక్కలకు గాను 430 మొక్కలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. పనుల అవకతవకల్లో బాధ్యులైన ఉద్యోగుల నుంచి రికవరీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సంజీవరావు, ఎంపీడీఓ చెంచమ్మ, పంచాయ తీరాజ్ ఏఈ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రసూల్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యూరింగ్, గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

టంగుటూరు: రైతులు క్యూరింగ్, గ్రేడింగ్‌లో జాగ్ర త్తలు పాటించి అన్య పదార్థాలు లేకుండా చూసుకో వాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచిం చారు. స్థానిక వేలం కేంద్రానికి సోమవారం చిరికూర పాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 921 బేళ్లను తీసుకురాగా వాటిలో 873 కొనుగోలయ్యాయి. వివిధ కారణాలతో 30 బేళ్లను వ్యాపారులు తిరస్కరిం చారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.174, సరాసరి ధర రూ.197.64 పలికింది. వేలంలో మొత్తం 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణా ధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.16.8 లక్షలు

కొండపి: జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామం లోని పోలేరమ్మతల్లి దేవస్థానం హుండీ ఆదాయం రూ.16,88,642 వచ్చినట్లు ఈఓ ఆర్.శివశంకర్ పేర్కొన్నారు. దేవస్థానంలో 5 నెలల 20 రోజులకు గాను వచ్చిన హుండీ కానుకలను కందుకూరు ఇన్‌స్పె క్టర్ జీపీ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

సింగరాయకొండ: 'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం , బాల్య వివాహాలతో శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయి' అంటూ విద్యార్థులు నినదిం చారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ స్పందించి అడ్డుకోవాలని, ప్రోత్సహించవద్దని విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్ చార్జి హెచ్ఎం హరేరామ్ ఆధ్వర్యంలో బాల్య వివాహా లతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థు లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టుకు 230 మంది హాజరు

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరు జెడ్పీ హైస్కూ ల్‌లో 5, 10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండలంలోని హాజీపురం గ్రామా నికి చెందిన కీసరి రామిరెడ్డి కుమారుడు డాక్టర్ కీసరి వెంకటేశ్వరరెడ్డి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు సహ కారం అందించారు. ఎంపీడీఓ టి.సుకుమార్ టాలెం ట్ టెస్ట్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజే శారు. డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్, ఎంఈఓ దాసు ప్రసాద్, దాత తండ్రి కీసరి రామిరెడ్డి, ప్రధానో పాధ్యాయులు రాజాల కొండారెడ్డి, టి.అంజనీదేవి, విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు హరిబాబు ధ్వజం

టంగుటూరు: దేవాలయం లాంటి చట్టసభలో కొం డపి టీడీపీ ఎమ్మెల్యే డీబీవీ స్వామి ప్రవర్తించిన తీరు ఆక్షేపణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పోడియం పైకి ప్లకార్డుతో వెళ్లడమే కాకుండా స్పీకర్ ముఖంపై తిప్పుతూ పేపర్ ముక్కలను చల్లడాన్ని తప్పుపట్టారు. టీడీపీ ఎమ్మెల్యే స్వామి స్థాయి మరిచి దిగజారుడు రాజకీ యాలు చేస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్‌కు రక్ష ణగా వెళ్లిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బా బుపై దౌర్జన్యం చేసి గాయపరచడం.. ఆపై గగ్గోలు పెట్టడం దొంగే 'దొంగా దొంగా..' అన్న చందంగా ఉందన్నారు. గత రెండు రోజులుగా స్కిల్ స్కామ్‌పై అసెంబ్లీలో చర్చ జరుగుతోందని, స్కామ్‌లో ప్రధాన నిందితుడైన చంద్రబాబు మీద నుంచి దృష్టి మళ్లిం చడానికి టీడీపీ ఎమ్మెల్యేలు నీచ రాజకీయాలు చేస్తు న్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారం మొత్తాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీని సింగిల్ డిజిట్‌కి పరిమితం చేయడం ఖాయమన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే స్వామి అసెం బ్లీలో హుందాగా నడుచుకోవాలని హితవు పలికారు.

అర్హత కలిగిన గ్రూపులకు వైఎస్సార్ ఆసరా



పొన్నలూరులో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం సురేష్

పొన్నలూరు: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి డ్వాక్రా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం వర్తిస్తుందని ఏపీఎం టి.సురేష్ పేర్కొన్నారు. పొన్నలూరులో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడతకు సం బంధించి డ్వాక్రా సంఘాలకు అవగాహన కల్పిం చారు. ఏపీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న డ్వాక్రా రుణాలను ప్రభుత్వం నాలుగు విడతల్లో మాఫీ చేస్తోందన్నారు. అందులో భాగంగా మూడో విడత నగదును ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు తెలిరు. అర్హత కలిగిన గ్రూపుల వివరాలను ఆయా సచివాల యాల్లో అందుబాటులో ఉంచామన్నారు. పొన్న లూరు మండలంలో 836 గ్రూపులు వైఎస్సార్ ఆసరా పథకానికి అర్హత పొందాయన్నారు. మూడో విడత నగదు రూ.7.49 కోట్లను 8,360 మంది మహిళల పొదుపు బ్యాంక్ ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రుణం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచే శారు. కార్యక్రమంలో సీసీలు ఎం.మాధవరావు, నరసయ్య, వెంకటేశ్వర్లు, మాధవ పాల్గొన్నారు.

కాలంచెల్లిన ఎరువులు విక్రయిస్తే చర్యలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రమేష్‌బాబు

కొండపి: కాలంచెల్లిన ఎరువులను రైతులకు విక్ర యిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.ర మేష్ హెచ్చరించారు. కొండపిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం ఏఓ రాముతో కలిసి తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడు తూ.. ఎరువుల దుకాణాల్లో లైసెన్స్‌లు అందరికి కన పడేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎరువుల నిల్వ, ధరల వివరాలు తెలిపే బోర్డును బయట ఉం చాలని చెప్పారు. రైతులకు బయోమెట్రిక్ విధానం లో ఎరువులు విక్రయించి, రశీదు ఇవ్వాలని స్పష్టం చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఏఏలు టీవీ నారాయణ, కె.శ్రీకాంత్ ఉన్నారు.

దళిత ఎమ్మెల్యేపై దాడి బాధాకరం

ఉలవపాడు: సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై అసెంబ్లీలో టీడీపీ సభ్యులు దాడిచేయడం బాధాకరమని మండల జేసీఎస్ కన్వీనర్ ధనకోటి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర చరిత్రలో బ్లాక్ డే అన్నారు. దాడి చేసిన టీడీపీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కందుకూరు అర్బన్: శాసనసభ సమావేశాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్ప వరపు కిషోర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే రఫీ, రూరల్ జేసీఎస్ కో ఆర్డినేటర్ చీమల వెంకటరాజ తీవ్రంగా ఖండించారు. దళిత ఎమ్మెల్యేపై దాడిచేసి వారిని గాయపరచడం దుర్మార్గమైన చర్యన్నారు.

గుడ్లూరు: అసెంబ్లీలో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే సుధాకర్‌బాబులపై దాడులు చేసిన టీడీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకో వాలని ఎంపీపీ పులి రమేష్, మండల మీడియా అధి కార ప్రతినిధి బిల్లా రమణయ్య డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పీసీపల్లి: అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే సుధాక ర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎం పీపీ అత్యాల జనన్య కోరారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు ఆగడాలకు కళ్లెం వేయాలని, దళిత ఎమ్మెల్యేపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

పట్టణంలో ఎద్దు బీభత్సం

- పలువురికి గాయాలు



ఎద్దును బంధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కనిగిరి రూరల్: పట్టణంలో ఎద్దు బీభత్సం సృష్టిం చి. రెండ్రోజుల నుంచి పాతకూచిపుడిపల్లిలో తీవ్ర అలజడి చేస్తూ తిరుగుతున్న ఎద్దు మంగళవారం పట్టణంలోని సుమారు 12మందిపై దాడిచేసి గాయ పరిచింది. పొమూరు రోడ్డులో ఎద్దు బీభత్సం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నట్లు సమా చారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గఫార్ మున్సిపల్ సిబ్బంది, పశువర్ధక శాఖ అధికారులను తీసుకుని వెళ్లి ఎద్దును పట్టి బంధించారు. ఎద్దుకు రెబీస్ వ్యాధి సోకినట్లు పశువైద్యాధికారి సత్యన్నా యణ తెలిపారు. ఎద్దును పొదిలి గోశాలకు తరలిం చినట్లు వెల్లడించారు.

పలువురికి గాయాలు

ఎద్దు చేసిన దాడిలో చాల మందికి స్వల్ప గాయాలు కాగా పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలైయ్యాయి. ఎద్దును పట్టి బంధించే క్రమంలో మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుడు ప్రసాద్‌పై ఎద్దు తిరగ బడి దాడి చేసింది. ఎద్దు ఒక్కసారిగా పైకి దూకడంతో ప్రసాద్‌కు చేతులకు రక్తపు గాయాలు కాగా, కుడి కాలు విరిగింది. దీంతో వెంటనే ఆస్పత్రికి తరలించి, వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పశువర్ధక శాఖ ఏడీ సత్యన్నారాయణ, మున్సిపల్ శానటరీ సెక్ర టరీలు లోకేష్, సులోచన, పవన్, రమణారెడ్డి, మున్సి పల్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తడిసిన పంటలు కాపాడుకోవచ్చు

- ఆత్మ పీడీ దగ్గుబాటి అన్నపూర్ణమ్మ



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న పీడీ అన్నపూర్ణమ్మ

సింగరాయకొండ: అకాల వర్షాల కారణంగా తడిసిన పంటలను ప్రత్యేక సస్యరక్షణ చర్యల ద్వారా విత్తనాలు మొలకెత్తకుండా కాపాడు కోవచ్చని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వ యకర్త దగ్గుబాటి అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా మండలంలోని కలి కవాయ గ్రామ పరిధిలో తడిసిన పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ మాట్లాడుతూ.. ఉప్పు ద్రావణాన్ని పంట లపై ఏ మోతాదులో పిచికారీ చేసి విత్తనాలు మొల కెత్తకుండా కాపాడుకోవచ్చో వివరించారు. వరి, శనగ, సోయాచిక్కుడు, మిరప, ధనియాల పం టలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. మం డల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి, డీఆర్సీ వ్యవ సాయాధికారి వీవీ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

సీఎస్‌పురం: మొబైల్ ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎం పీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. మండలం లోని డీజీపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ క్యాంప్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆధార్‌ను ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంద న్నారు. మంగళవారం బోయమడుగుల పంచాయతీ వెంకటాయచెరువులో మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలి పారు.

హనుమంతునిపాడు: మండలంలోని దాసరిపల్లి సచివాలయాన్ని, కొండారెడ్డిపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీఓ ఎం. క్రిష్ణారావు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం కొం డారెడ్డిపల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను పరి శీలించారు. సచివాలయ కార్యదర్శులు, ఈఓ ఆర్డీఓ షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: మండలంలోని పెదపవ నిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సం క్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2023–24 సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమం లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత తెలిపారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాల్గవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు చెందిన విద్యా ర్థులు అర్హులన్నారు. మార్చి 24 లోగా ఆన్‌లై న్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కందుకూరు డిపో నుంచి యాత్రా స్పెషల్ బస్సులు

- ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజరెడ్డి



ఆర్టీసీ యాత్రా స్పెషల్ కరపత్రికను ఆవిష్కరిస్తున్న నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ సుప్రజరెడ్డి

సింగరాయకొండ: కందుకూరు డిపో నుంచి అరుణాచలం, కర్ణాటక, షిరిడీ యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌ప ర్సన్ బత్తుల సుప్రజరెడ్డి పేర్కొన్నారు. కందుకూరు డిపో ఆధ్వర్యంలో యాత్రా స్పెషల్ బస్సుల కరపత్రికను సోమవారం సింగరాయకొండలోని తన నివాసంలో సుప్రజరెడ్డి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏప్రిల్ 4వ తేదీన అరుణాచలం యాత్ర, 6వ తేదీన కర్ణాటక యాత్ర, మే ఒకటో తేదీన షిరిడీ యాత్రకు ప్రత్యేక లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని వివరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా కొండపి మండలంలో ప్రతిష్టాత్మకంగా జరిగే జాళ్లపాలెం తిరునాళ్లకు బస్సులు నిలిపే స్థలం విషయమై సీఐతో మాట్లాడారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కందుకూరు డిపో మేనేజర్ పెద్దనశెట్టి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.